
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పరుగాపడం

**"వావ్ మళ్ళీ** పార్టీనా? ఎందుకు? లాటరీ తగిలిందా? అందరినీ రిసార్ట్ కి తీసుకెళ్ళి మరీ ఇస్తున్నావ్? వీకెండ్ కి?" అడిగాడు క్రిస్ తన స్నేహితుడు, కంపెనీ సీ.ఈ.ఓ, గేరీ ని..

నవ్వాడు గేరీ..

ఆఫీసులో గుసగుసలు వినబడుతున్నాయి అప్పటికే అందరికీ.. గేరీ రిటైర్ అయిపోతున్నాడుట. మరో నాలుగు నెలల్లో కొత్త సీ.ఈ.వో వస్తాడుట అని..

ఆ మాట అడగడానికి ధైర్యం చాలలేదు క్రిస్ కి.

' పెద్ద పార్టీ కాదులే, మన వాళ్ళకే, క్లోజ్ గ్రూప్ కి, యా' వాచ్ అవుట్ ఫర్ ద పార్టీ !' అన్నాడు గేరీ నవ్వుతూ..

కారిడార్ లో గేరీ నడిచి వెళ్ళిన బూట్ల చప్పుడు నెమ్మదిగా క్రిస్ చెవుల్లో వినిపిస్తోంది. ఆరడుగుల నాలుగంగుళాల మనిషి గేరీ.

సూదంటురాళ్ళల్లాంటి చురుకైన చిన్న నీలం కళ్ళు, సూటిగా ఉన్న ముక్కు, ఎప్పుడూ నవ్వుతున్నట్లుండే పెదాలు. అతన్ని చూడగానే ఇష్టపడకపోవడం దాదాపు అసాధ్యం.. అద్భుతమైన లీడర్ అతను. తను సీ.ఈ.వో అయిన ఈ నాలుగేళ్ళల్లో కంపెనీని ఎంతో వృద్ధిలోకి తెచ్చాడు. సేల్స్, కొత్త ప్రాడక్ట్స్ అన్నింటిలోనూ ముందుండేలా చూశాడు. ఎప్పుడు పని ముగిస్తాడో, మర్నాడు ఎప్పుడు మొదలు పెడతాడో తెలీదు, ఎప్పుడూ పని చేస్తున్నట్టే ఉంటాడు, అలాగని ఎప్పుడూ అలసి పోయినట్టు ఉండడు..

నలభై రెండేళ్ళకే అతి చిన్న సీ.ఈ.వో గా ఎదిగాడు. ఈ నాలుగేళ్ళల్లోనూ అందరి మనసులూ గెలుచుకున్నాడు.

రక రకాల ఊహాగానాల మధ్య వారాంతం రానే వచ్చింది.

తన ముఖ్యమైన స్నేహితులని, కుటుంబ సభ్యులని పిలిచారు పార్టీకి. ఆఫీస్ వాళ్ళెవరూ ఎక్కువగా లేకపోవడంతో ఇది అధికారికంగా ఇచ్చే పార్టీ కాదని అర్థం అయింది..

అందరూ డ్రింక్స్ తీసుకున్నాకా, ఆ బీచ్ ఒడ్డున్న ఉన్న రిసార్ట్ లో చల్లగాలి నెమ్మదిగా వీస్తుంటే అంతకంటే నెమ్మదిగా చెప్పాడు.

" నేను పిలవగానే వచ్చినందుకు మీ అందరికీ నా ధన్యవాదాలు. ఇకనించి పార్టీలే , పార్టీలు అన్నాడు నవ్వుతూ.. పక్కనే అతని భార్య గ్రేసీ..

'ఆ నవ్వులో కనబడని చిన్న దిగులు.. అందరికీ కనిపించిందా? 'అనుకున్నాడు క్రిస్

' వావ్, పార్టీలే, పార్టీలా? ఎలా?' అన్నారు..

' నేను రిటైర్ అయిపోతున్నాను కాబట్టీ' అన్నాడు గేరీ. చిన్నగా ఈల వేస్తూ..

' వాట్, రిటైర్?" గాలి నిలబడింది ఒక్క క్షణం.."

' నిజమేనా? బోర్డ్ కి చెప్పావా? వాళ్ళు ఒప్పుకున్నారా?' క్రిస్ అడిగాడు, ఆత్రుతగా..

' చెప్పాను, ఇంకా ఒప్పుకోలేదు'అన్నాడు గేరీ..

"ఒప్పుకోరు కూడా, నాకు తెలుసు.. ఇదేమీ జరిగేది కాదు కానీ మరో మాట చెప్పు" అన్నాడు క్రిస్.

గేరీ నవ్వలేదు ఈసారి. "లేదు క్రిస్, ఇందాకా నేను నవ్వుతూ చెప్పినా, నా ఈ నిర్ణయం వెనకున్న కారణం బలమైనది.. కనక వద్దనలేరెవరూ, బోర్డ్ మాత్రమే కాదు, మీరెవరూ కూడా" అన్నాడు ఎటో చూస్తూ..

' ఏమయింది గేరీ!' కేథీ అడిగింది. తను గేరీకి, నాకు చిన్నప్పటి ఫ్రెండ్.

నేను చెప్తాను, అంటూ వచ్చింది ట్రేసీ. గేరీ భార్య గ్రేసీ కవలసోదరి.

"హేయ్, ఇప్పటివరకూ కనిపించలేదు.!" అంది కేథీ ట్రేసీని కౌగలించుకుంటూ..

"ఇదేం? ఇక్కడేకా ఉన్నాను. లేత నీలం స్కర్ట్, పింక్ బ్లవుజ్ వేసుకునీ" అంది ట్రేసీ నవ్వుతూ.

'అల్లరి పిల్లా, నువ్వూ మారలేదు, నీ అల్లరీ మారలేదు. అది గ్రేసీ కదూ' అంది కేథీ నవ్వుతూ.

"అది గ్రేసీ అయితే మరి నేను?? ".. అంది గ్రేసీ గేరీ చెయ్యి విడిపించుకుని వాళ్ళ దగ్గరకొస్తూ.

నవ్వింది కేథీ.

"ఒకే ఒప్పుకున్నాం! మీ ఇద్దరిలో తేడా కనిపెట్టడం కేవలం గేరీ వల్ల మాత్రమే అవుతుంది. "అంది నవ్వుతూ..

కాలేజ్ రోజులనించీ అంతేగా! కొత్తేముంది? అన్నాడు రోజర్..

నవ్వులు..

అందరూ తీరిగ్గా భోజనాలకు్కూర్చున్నారు. పన్నెండుమంది ఉంటారేమో! బాగా దగ్గర స్నేహితులు, ఒకరిద్దరు కజిన్స్..

ఇంకా ఎవరికీ అర్థం కావడం లేదు, గేరీ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో?

"నేను సంప దించాలనుకున్న దానికన్నా శ్వేన్నో రెట్లు ఎక్కువ సంపాదించాను, ఇప్పుడు టైం టు ఎంజాయ్. అంతే, అందుకే!" అన్నాడు క్రిస్ దగ్గరగా వస్తూ... అతని చిన్న నీలి కళ్ళల్లో రవ్వంత దిగులు కమ్మి, వాన మేఘం మూసిన నీలి మబ్బుల్లా ఉన్నాయి.

' కారణం నువ్వు మాకు చెప్పాలా? నీ లైఫ్, నీ ఇష్టం' అన్నాడు క్రిస్.

' నో , నో, అంత సింపుల్ కాదు క్రిస్. గేరీ నా కోసం మానేస్తున్నాడు, నేను వద్దంటున్నా సరే, ఇద్దరూ నా మాట పిసరంత లెక్కపెట్టడం లేదు ' అంది ట్రేసీ, కాస్త కోపంగా, మరి కాస్త బాధగా...

' నిజమా?" అన్నాడు క్రిస్ గ్రేసీ వంక చూస్తూ.. అప్పటికే మరో నలుగురు స్నేహితులు వారి చుట్టూ చేరారు.

గ్రేసీ కళ్ళ నిండా నీళ్ళు..

యా, ఒక రకంగా అవును... అంది గ్రేసీ ఉబికి వస్తున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ

'కొంపదీసి ట్రేసీని పెళ్ళి చేసుకోబోతున్నావా?" అని అడిగి వేళాకోళం చేద్దామనుకున్న కేథీ మాట నోట్లోనే ఉండిపోయింది.

చిన్న చినుకులా మొదలైన వాన ప్రవాహమైనట్టు గ్రేసీ వెక్కి వెక్కి ఎడవడం మొదలుపెట్టింది.

గ్రేస్! కాం డవున్! ఏమయింది? ఒక్క క్షణం నవ్వుతూ, మరో క్షణం బాధపడుతూ మమ్మల్నందర్నీ కన్ ఫ్యూజ్ చేస్తున్నారు. ప్లీజ్, కొద్దిగా సంబాళించుకుని ఏమయిందో చెప్పు ప్లీజ్ నువ్వైనా? అంది కేథీ స్నేహితురాలిని అనునయిస్తూ దగ్గరకొచ్చింది కేథీ.

అప్పటికే గేరీ ఆమెని దగ్గరకు తీసుకుని ఊరదించడం మొదలుపెట్టాడు. వారిద్దరివైపు ఒకరకమైన అపరాధ భావంతో చూస్తోంది ట్రేసీ...

ఒకరికి తెలియకుండా మరొకరు గేరీని ఆ కవలలిద్దరూ ప్రేమించారన్న విషయం అక్కడున్న అందరికీ తెలుసు..

ఎప్పుడు గల గలా కబుర్లు చెప్తూ, అల్లరి చేసే ట్రేసీ కన్నా, నెమ్మదిగా నిర్మలగోదావరిలా ఉండే గ్రేసీ ని ఇష్టపడ్డాడు గేరీ.. దానికి ట్రేసీ కొన్నాళ్ళు అలిగి వాళ్ళిద్దరికి దూరం వెళ్ళిపోయింది. ఆతర్వాత అక్కచెల్లెళ్ళిద్దరూ మళ్ళీ కలిశారు. ట్రేసీ పెళ్లి ఆర్థర్ తో జరిగింది కానీ కొన్నాళ్ళకే ఆ దంపతులిద్దరూ విడిపోయారు. అప్పటినించీ ట్రేసీ గేరీ వాళ్ళ దగ్గరలోనే ఉంటూ, వారి కుటుంబంలో భాగమైపోయింది.

గ్రేసీ, గేరీల తొలి సంతానం కెవిన్ పుట్టినప్పుడు గ్రేసీకి పెద్ద జబ్బు చేసింది, అప్పుడు అక్కను కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంది ట్రేసీ..

ఆ తర్వాత వారు కెవిన్ కు తోడుగా మరొక బిడ్డ కావాలనుకున్నప్పుడు గ్రేస్ ఆరోగ్య రీత్యా డాక్టర్లు వద్దన్నారు. అప్పుడు తన అక్క కోసం ట్రేసీ సరోగసీ పద్ధతిలో బిడ్డని కనివ్వడానికి సిద్ధపడి వాళ్ళిద్దరినీ ఒప్పించింది. అలా కియా పుట్టింది.

మళ్ళీ పెళ్ళి చేసుకోమంటే ఎందుకో ట్రేసీ ఎప్పుడూ వినలేదు.

దగ్గరలోని మిడిల్ స్కూల్ లో టీచర్ గా పనిచేస్తూ తన రెండు బెడ్ రూముల ఇంట్లో ఉండేది. అక్కా, బావల ఎదుగుదలని, పిల్లల పెరుగుదలని చూసి సంబరపడేది, వాళ్ళ సంబరాల్లో పాలు పంచుకునేది అంతే తప్ప ' ఒక్కర్తివీ అక్కడెందుకు? మాతోనే ఉండవచ్చు గా?" అన్నా వినేది కాదు. ఎప్పుడూ అన్నింటికీ నవ్వే సమాధానం.

'నువ్వు కూడా రోజు రోజుకీ మీ అక్కలా అయిపోతున్నావు, ఇంక నేను గుర్తు పట్టేదెలా? ట్రేసీ అంటే అల్లరి చెయ్యాలీ' అని గేరీ అంటే...

' అల్లరి చేసే వయసు కాదుగా గేరీ! అయినా అక్కతో నన్ను పోల్చద్దు, షీ ఈజ్ ఏ జెం ' అనేది..

ఇలా ఎంతో చక్కగా ఉంటారు వాళ్ళు. అలాంటిది ఈ ఏడుపులేమిటి? ట్రేసీ కోసం గేరీ ఇంత చిన్న వయసులో రిటైర్ అవుతాననడం ఏమిటి? " ఇవే అందరి మనసుల్లో నూ మెదులుతున్న ప్రశ్నలు...

ఐదారు నిమిషాలు పట్టింది గ్రేసీ కి మామూలు మనిషవ్వడానికి. గేరీ భుజం మీద తలవాల్చి వెక్కుతూనే ఉంది.. ఆమె మెత్తటి జుట్టు సవరిస్తూ ఉండి పోయాడు గేరీ..

"ఏమీ అర్ధం కావడం లేదు! నాకు!" రోజర్ అన్నాడు.

ట్రేసీ నువ్వు చెప్తావా? అన్నాడతను..

"యెస్, నేను చెప్తాను.. కానీ ఇలాంటి తొందరపాటు పనులు చెయ్యద్దని గేరీకి మీరు చెప్పాలి" అంది ట్రేసి ఖాళీ టేబిల్ ఎక్కి కూర్చుంటూ...

అసలు విషయం చెప్పు

' నాకు యుటిరైన్ కేన్సర్. ' ఆమె ఏ ఉపోద్ఘాతం లేకుండా చెప్పిన మాటలకి చకితులయిపోయారు అందరూ..

'వాట్?' అన్నాడు రోజర్..

'ట్రేస్.. ప్లీజ్' అంది గ్రేసీ..

'నో గ్రేస్, చెప్పనీ నన్ను.. అంతా మనవాళ్ళే కదూ, దాచేదేముంది? అడ్వాన్స్‌డ్ స్టేజ్ లో ఉంది ఎన్నాళ్ళుంటానో తెలీదు, కీమో, రేడియేషన్ లు వద్దన్నాను. ఎలాగూ అందరూ పోయేవాళ్ళమే, ఇలా హేపీగా మీ అందరితో ఉండి, ఒకరోజు వెళ్ళిపోతే చాలు కదా, అంతకంటే ఇంకేం కావాలి?

కానీ గేరీ, గ్రేస్ నా మాట వినడం లేదు. నన్ను ప్రపంచంలో ఎక్కడికైనా తీసుకువెళ్తామని, ట్రీట్మెంట్ ఇప్పిస్తామని ఒకటే గొడవ. అంతే కాదు, నేనున్నాళ్ళు ఇద్దరూ నాతోనేఉండి నన్ను చూసుకుంటారుట. అది, అదే ఈ నిర్ణయానికి కారణం. మీరైనా చెప్పండి గేరీకి. ఎంత చిన్నవాడు తను, ఇంత పెద్ద కంపెనీకి సీ.ఈ.వో అవ్వడం అంటే మాటలా? ఇంత బాగా చేస్తున్నాడు, ఇప్పుడు ఉద్యోగం వదిలెయ్యడం అంటే ఇదేమైనా చిన్నపిల్లల ఆటా?

ఇదే గత రెండు మూడు వారాలుగా మామధ్య నడుస్తున్న విషయం.. మీరైనా చెప్పండి గేరీకి.. నేనే నా ఉద్యోగం మానడం లేదు, అలాంటిది తను మానేసి ఏం చేస్తాడు? ' అంటోంది ట్రేసీ..

విన్న విషయాన్ని అర్ధం చేసుకునే ప్రయత్నంలో మౌనంగా ఉండిపోయారు శ్రోతలందరూ...

'ఇప్పుడు వీళ్ళిద్దరూ పనులన్నీ మానేసుకుని నాతో ఉంటే నాకు తగ్గిపోతుందా? నాకున్న ఆయుష్షు పెరిగిపోతుందా? నేనేమైనా చిన్నపిల్లనా ఉయ్యాలూపి, నోట్లో ముద్దలు పెట్టాలా? అందుకే అంటారు ఒక్కోసారి పెద్దవాళ్ళు కూడా పిల్లలై పోతారు అని. ఇప్పటికే గ్రేస్ మానేసింది తను చేసే పని.. ఇప్పుడు గేరీ కూడా..

నేను మాత్రం నా చివరి శ్వాస వరకూ నాకు నచ్చే పనులన్నీ చేస్తూనే ఉంటాను.. ఒక్కటి కూడా మానే ప్రశ్నే లేదు. అందుకని నా కోసం వీళ్ళనిలాంటి అర్థం లేని త్యాగాలన్నీ మానుకుని ఎవరి పనులు వాళ్ళని చేసుకోమని చెప్పండి.' అంది ట్రేసీ, ఇంక తనేమీ చెప్పేది లేదన్నట్టుగా..

" ట్రేసీ విల్ యూ ప్లీజ్ షట్ అప్!" ఎర్రబడిన ముఖం తో గేరీ అన్నాడు..

'మేమేం చేస్తున్నామో మాకు తెలుసు. నువ్వు కూడా తెలుసుకుంటే మంచిది, ట్రీట్ మెంట్ వద్దు అంటే విని ఊరుకోవడానికి మేమెవ్వరమూ పసిపిల్లలం కాదు. నేను ఇందాకే చెప్పాను, నేను అనుకున్న దానికన్నా ఏన్నో రెట్లు ఎక్కువే సంపాదించాను.

నలభై ఐదేళ్ళకి రిటైర్ అవుతానని గ్రేస్ కి మా పెళ్ళి నాడే చెప్పాను. క్రిందటి నెల నలభై ఆరయ్యాయి నాకు, ఇప్పటికే ఒక సంవత్సరం లేట్ అయింది.

పరుగు పందెం బావుంటుంది, విజేతగా నిలవడం ఇంకా బావుంటుంది. కానీ పరుగెప్పుడాపాలో తెలుసుకుంటే మరింత బావుంటుంది. అందుకని ఈ విషయం గురించి గత ఆరునెలలుగా ఆలోచిస్తూనే ఉన్నాం, ఎందుకో తెలుసా? అనుకున్నంత తేలిక కాదు అమలు పరచడం.. పిల్లలు కాలేజీలకొచ్చారు, ఇది సరీయిన సమయమని అనుకుంటూ ఉండాగా అశనిపాతంలా నీకిలా జరగడమే మన దురదృష్టం. బట్ వీ ఆర్ కాన్ ఫిడెంట్ నీకు తప్పకుండా నయమవుతుంది అని మా నమ్మకం.

మేమాపుతున్న పరుగు నీకు తిరిగి నడకనిస్తే మాకంతే చాలు అనుకున్నాం. రేస్ లో పాల్గొనాలన్న ఉత్సాహం ఉండాలే కానీ ఎప్పుడైనా మళ్ళీ చేరచ్చు కాకపోతే కొన్ని స్థానాల వెనక కావచ్చు, ఐ యాం ఓకే విత్ దట్.. సో ఇంక వేరే డిస్కషన్స్ లేవు.. మేమందరం చెప్పింది వినడానికి సిద్ధంగా ఉండు.. అంతే అన్నాడు సీ.ఈ.వో. గేరీ.."

Click here to share your comments on this story